
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



కరీంనగర్

జిల్లా వార్తలు

3

బుధవారం 14 ఫిబ్రవరి 2024

ఎండుతున్న పంటలు



కాలువలో పేరుకపోయిన గడ్డి

- చివరి ఆయకట్టుకు అందని సాగు నీరు
- ఆందోళనలో అన్నదాతలు

సైదాపూర్, ఫిబ్రవరి 13: మండలంలోని పలు గ్రామాల్లో నీళ్లు లేక యాసంగి పంటలు ఎండుతున్నాయి. ఇప్పటికే భూగర్భ జలాలు అడుగంటడంతో కాలువ నీళ్లపై రైతులు ఆశలు పెట్టుకున్నారు. మిడ్ మానేరు కుడి కాలువ ద్వారా వచ్చే సాగు నీటితో పంటలు పండుతాయని ఆశగా ఎదురు చూశారు. ప్రాజెక్టు నుంచి నీటిని వదిలినా కాలువలు సరిగా లేకపోవడంతో మండలంలోని ఘనపూర్ గ్రామం వరకే వస్తున్నాయి. దీంతో ఎగువ గ్రామాల్లోని రైతులు సాగునీటి కోసం ఇబ్బంది పడుతున్నారు. కాలువ వెంట తిరిగి నీటి కోసం ఎంత ప్రయత్నించినా ఫలితం ఉండడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలువలో గడ్డి పేరుక పోయిందని, ముందు ఉన్న రైతులు తూములు తీసి నీళ్లు ఎక్కువ వాడుకుంటున్నారని వారు అంటున్నారు. అధికారులకు ఈ విషయంపై ఫిర్యాదు చేస్తే పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి చివరి ఆయకట్టుకు నీరందించేందుకు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.



రెండెకరాల వరి ఎండింది

- మెడవేన ప్రభాకర్, రైతు, గుజ్జులపల్లి

బావిలో నీళ్లు ఉన్నాయని, కాలువ నీళ్లు వస్తాయని మూడు ఎకరాల్లో వరి సాగు చేశాను. నీళ్లు అందక రెండు ఎకరాల వరి ఎండింది. కాలువలు సరిగా లేక నీళ్లు అందడం లేదు. చివరి ఆయకట్టు వరకు నీరందేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.



అధికారులు పట్టించుకోవడం లేదు

- పేరం తిరుపతి, రైతు, జాగీర్‌పల్లి

నా బావిలో నీళ్లతోపాటు కాలువ నీళ్లు వస్తాయని నమ్మి మూడు ఎకరాల్లో మొక్కజొన్న, రెండు ఎకరాల్లో వరి పంట సాగు చేశాను. ఎండలు ముదురుతుండడంతో బావి ఎండింది. 20 రోజులగా కాలువ వెంట తిరుగుతున్నా నీళ్లు రావడం లేదు. ముందున్న రైతులు తూములు తెరిచి ఎక్కువ నీళ్లు వాడుతున్నారు. అధికారులకు ఫిర్యాదు చేస్తే పట్టించుకోవడం లేదు.



ఎల్లంపల్లి శివారులో నీళ్లు లేక ఎండుతున్న వరి పంట

అంధ, బధిర విద్యార్థులను చైతన్య పరచాలి

- కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్ టౌన్,ఫిబ్రవరి 13: జిల్లాలోని ప్రభుత్వ అంధుల, బధిరుల ఆశ్రమ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు వివిధ అంశాలపై అవగాహన కల్పించి వారిలో చైతన్యం తీసుకురావాలని తెలంగాణ సాంస్కృతిక సారధి కళాకారులకు కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశమందిరంలో తెలంగాణ సాంస్కృ తిక సారధి కళాకారుల విధులపై కలెక్టర్ దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని సాంస్కృ తిక సారధి కళాకారుల్లో కొందరు వారంలో ఐదు రోజులు పాఠశాలలకు వెళ్లి గుడ్ టచ్ బ్యాడ్ టచ్, పరిశుభ్రత, రోజువారి అల వాట్లు, స్నేహిత తదితర కార్య క్రమాలపై ఆటపాటల ద్వారా అవగా హన కల్పించాల న్నారు. మరి కొందరు ప్రభుత్వం ద్వారా ప్రవేశపెడుతున్న వివిధ సంక్షేమ పథకాలతోపాటు గర్భి ణులు తీసుకోవ లసిన పౌష్టికాహారం, సిజేరియన్ కాన్పుల వల్ల కలిగే ఇబ్బందులు, మహిళల్లో రక్తహీనత తదితర అంశాలపై పాఠశాలల్లో అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. సమావేశంలో సమాచారశాఖ సహాయ సంచాలకుడు అబ్దుల్ కలీమ్, జిల్లా సాంస్కృతిక సారధి కళాకారులు వడ్ల కొండ అనిల్, దుర్గ మురళి, జి.కోమల, వొల్లాల వాణి, టి రాజు, ఎం సౌమ్య, ఎండీ నిజాముద్దీన్, కె తిరుపతి, శ్రీకాంత్ పాల్గొన్నారు.



చదువుల తల్లి మెచ్చిన రోజు...

నేడు వసంత పంచమి

కరీంనగర్ కల్చరల్, ఫిబ్రవరి 13: చదువుల తల్లి సరస్వతీదేవికి మాఘ శుక్ల పంచమి ప్రీతికరమైన రోజు కావడంతో బుధవారం వసంత పంచమిగా జరుపుకోనున్నారు. విద్యార్థులకు, విజ్ఞానార్థులకు విశిష్ట దినమైన వసంత పంచమి నాడు సరస్వతీ పూజ



చేస్తారు. విద్యలో ఉన్నతిని ప్రసాదించమని పుస్తకాలను అర్పిస్తారు. అక్షరాభ్యాసాలు, పలకలు, పుస్తకాలు, పెన్నుల దానాలు చేస్తారు. పెద్దవారు, ఉపాసకులు, దీక్షాపరులు తమ గురువులు, మఠ, పీఠాధిపతులు, బ్రాహ్మణుల నుంచి ఉపదేశాలు స్వీకరిస్తారు. సరస్వతీ ఆలయాల్లో అభిషేక అర్చనలు, పూజలు, పల్లకి సేవలు నిర్వహిస్తారు. శ్రీపంచమి నాడు ఏ కార్యం చేపట్టినా జయప్రదమే అవుతుందని శాస్త్రం చెబుతోంది. మాఘమాసం కావడంతో ఈ రోజు మంత్ర స్వీకరణలు, అర్చనలు, ప్రత్యేక అభిషేక అర్చనలతోపాటు వేలాది సంఖ్యలో వివాహాది శుభకార్యాలు జోరుగా జరగనున్నాయి.

● ముస్తాబైన ఆలయాలు...

వసంతపంచమి కోసం ఆలయాలు ముస్తాబయ్యాయి. పూజలు, అక్షరాభ్యాసాలు ఘనంగా నిర్వహించనున్నారు. నగరంలో ప్రధానమైన మూడు సరస్వతీ ఆలయాల్లో వేలాది మంది పూజలు జరుపనున్నారు. మహాశక్తి, యజ్ఞవరాహస్వామి ఆలయ అనుబంధ వాగ్వాదిని మహాసరస్వతి, గాయత్రినగర్ గణేశశారదాశంకరాలయాల్లో పూజలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. భక్తులు అమ్మవారికి ఒడి బియ్యం సమర్పించి మొక్కులు చెల్లించుకోనున్నారు. విద్యార్థుల పూజల కోసం ఆలయాల్లో నోటుబుక్కులు, పలకలు సిద్ధం చేశారు.

● మహాశక్తి ఆలయంలో ప్రత్యేక పూజలు

నగరంలోని చైతన్యపురి మహాశక్తి ఆలయంలో బుధవారం వసంతపంచమి సందర్భంగా ప్రత్యేక పూజలు జరగనున్నాయి. ఈ మేరకు మంగళవారం ఆలయంలో అన్ని ఏర్పాట్లు చేశారు. ఆలయాన్ని పూలు, విద్యుత్ దీపాలతో అలంకరించారు. బుధవారం ఉదయం 4 గంటల నుంచి అమ్మవార్లకు అభిషేక అర్చనలు, 8 గంటలఅ నుంచి సామూహిక కుంకుమార్చన, పుస్తక పూజ, అక్షరాభ్యాస కార్యక్రమాలు జరుగుతాయని అర్చకులు తెలిపారు.



మహాశక్తి ఆలయం

'బల్దియా'లో కీలక పోస్టులు ఖాళీ

● భర్తీకి మోక్షమెప్పుడో?



కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 13: కరీంనగర్ నగరపాలక సంస్థలో కీలకపోస్టులు ఖాళీ అవుతు న్నాయి. అధికారులు, ఉద్యోగులు బదిలీ అయినా, పదవీ విరమణ చెందినా మళ్ళీ వారి స్థానంలో కొత్త వారికి పోస్టింగ్ ఇవ్వడం లేదు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో కేంద్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలోని వివిధశాఖల్లో మూడేళ్లకు పైగా పని చేస్తున్న అధికారులు, ఉద్యోగులను బదిలీ చేస్తోంది. ఇందులో భాగంగా మంగళవారం నగర పాలక సంస్థలో ఇద్దరు కీలక అధికారులను ప్రభుత్వం బదిలీ చేసింది. వారి స్థానంలో కొత్తవారికి పోస్టింగ్ ఇవ్వలేదు. ఒకటిరెండు రోజుల్లో మరికొంత మంది అధికారుల బదిలీలు ఉండవచ్చని తెలుస్తోంది. బదిలీ అయిన స్థానంలో కొత్తవారిని నియమించక పోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇప్పటికే నగరపాలక సంస్థ కార్యాలయంలో అడిషనల్ కమిషనర్ పోస్టు ఖాళీగా ఉంది. అసిస్టెంట్ కమిషనర్‌నూ బదిలీ చేశారు. స్మార్ట్‌సిటీ, సీఎం హామీ నిధులతో వందల కోట్ల రూపాయలతో చేపడుతున్న అనేక అభివృద్ధి పనులు అసంపూర్తిగా ఉన్నాయి. ఈ తరుణంలో ఇంజనీరింగ్ విభాగంలో కీలకమైన ఎస్‌ఈ కొద్ది నెలల క్రితం బదిలీపై వెళ్లగా ఆయన స్థానంలో ఎవరినీ నియమించలేదు. డీఈఈ, ఏఈఈ పోస్టులు, వర్కింగ్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. సానిటేషన్‌లో ఇటీవల సూపర్‌వైజర్ సస్పెన్షన్‌కు గురికాగా, అంతకు ముందే ఒక సానిటరీ ఇన్‌స్పెక్టర్ పోస్టు ఖాళీగా ఉంది, డాక్టర్ పోస్టు చాలా రోజులుగా భర్తీ చేయలేదు. టౌన్‌ప్లానింగ్ విభాగంలోనూ సూపర్‌వైజర్, బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

● కేసుల భయంతో మరి కొందరు..

ఇటీవల స్మార్ట్‌సిటీ, సీఎం హామీ నిధులతో చేపట్టిన అభివృద్ధి పనుల్లో అవినీతి అక్రమాలు జరిగాయని, అక్రమ భూకబ్జాలకు కొంత మంది అధికారులు సహకరించారనే ఆరోపణలు వస్తున్నాయి. అక్రమార్కులపై సీపీ కఠిన చర్యలు తీసుకుంటున్నారు. అవినీతిపై విచారణ జరిపిస్తామని రాష్ట్ర ప్రభుత్వ ప్రకటించడంతో ప్రస్తుతం ఇక్కడ పనిచేస్తున్న కొంత మంది అధికారులు, ఉద్యోగులు భయాందోళనకు గురవుతూ బదిలీల కోసం పైరవీ చేసుకుంటున్నట్లు తెలిసింది. ఇక్కడికి వచ్చేందుకు అధికారులు, ఉద్యోగులు భయపడుతున్నారని, వచ్చేందుకు నిరాకరిస్తున్నారని, అందుకే ఖాళీలు భర్తీ చేయడం లేదని సమాచారం. రాష్ట్ర ప్రభుత్వం ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని ప్రజలు కోరుతున్నారు.

జిల్లా క్రీడాశాఖ అధికారి బదిలీ

కరీంనగర్ స్పోర్ట్స్, ఫిబ్రవరి 13: జిల్లా యువజన క్రీడాశాఖ అధికారి కీర్తి రాజవీరు బదిలీ అయ్యారు. ఈమేరకు స్పోర్ట్స్ అథార్టీ ఆఫ్ తెలంగాణ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. 2020 మార్చిలో జిల్లా క్రీడాశాఖ అధికారి బాధ్యతలు చేపట్టిన ఆయనను మంచిర్యాల జిల్లా క్రీడాశాఖ అధికారిగా బదిలీ చేశారు. ఆయన స్థానంలో మంచిర్యాల జిల్లా క్రీడాశాఖ అధికారి బి శ్రీకాంత్‌రెడ్డిని నియమించారు.

వాతావరణ పరిస్థితులపై రైతులకు అవగాహన కల్పించాలి



ఏఈఓల సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి ప్రియదర్శిని

కరీంనగర్ రూరల్, ఫిబ్రవరి 13: మారుతున్న వాతావరణ పరిస్థితులపై రైతులకు అవగాహన కల్పించాలని జిల్లా వ్యవసాయాధికారి ప్రియదర్శిని అన్నారు. మంగళవారం కొత్తపల్లి రైతు వేదికలో నీటి యాజమాన్యం సంరక్షణపై వ్యవసాయ విస్తరణ అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శిక్షణ కార్యక్రమంలో నేర్చుకున్న అంశాలను రైతులకు వివరించాలన్నారు. కార్యక్రమంలో ఎఫ్‌టీసీ ఛత్రునాయక్, జమ్మికుంట కేవీకే శాస్త్రవేత్త వెంకటేశ్వర్‌రావు, సహాయ వ్యవసాయ సంచాలకులు కె సునీత, అంజని, సుబ్బారావు, అన్నపూర్ణ, శాస్త్రవేత్త మంజులత, గిరీష్ పాల్గొన్నారు.

నేడు అధ్యయనోత్సవం



ముస్తాబవుతున్న అధ్యయనోత్సవ వేదిక

కరీంనగర్ కల్చరల్, ఫిబ్రవరి 13: జిల్లా కేంద్రంలోని మార్కెట్‌రోడ్ వేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం అధ్యయనోత్సవం, పరమపదోత్సవం నిర్వహించనున్నారు. ఉదయం 7 గంటల నుంచి ఉత్సవ మూర్తుల ముందు తొళ్లక్కము, ద్రవిడ వేద ప్రబంధ పారాయణం, సాయంత్రం 6 గంటల నుంచి నమ్మాళ్వార్ పరమపదోత్సవం జరుపనున్నారు. పలువురు ప్రముఖులు అధ్యయనోత్సవంలో పాల్గొని శ్రీవారికి శంగోలం సమర్పించనున్నారు. ఈ సందర్భంగా ఆలయాన్ని మామిడి తోరణాలు, పూలు, అరటి బోదెలు, ఆకులు, రంగుల విద్యుత్ దీపాలతో సర్వాంగసుందరంగా అలంకరించారు. ప్రధాన వేదికను అమరవీరుల స్తూపం వద్ద సిద్ధం చేశారు. ఆలయానికి మూడు వైపులా స్వాగత తోరణాలు ఏర్పాటు చేశారు. రోజువారి సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా బుధవారం వేదికపై ఉదయం నుంచి సాయంత్రం వరకు వివిధ భజన మండళ్ల ఆధ్వర్యంలో భజనలు, సంకీర్తనలు, నృత్య ప్రదర్శనలు కొనసాగనున్నాయి. ఆధ్యాత్మిక ప్రవచకుడు చాగంటి కోటేశ్వరరావు అనివార్య కారణాల వల్ల కరీంనగర్‌కు రావడం లేదు. రాత్రి 7 గంటల నుంచి ఆన్ లైన్ ద్వారా ప్రవచనం వినిపించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

మరి కొందరి అరెస్టుకు రంగం సిద్ధం



కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 13: భూ కబ్జాదారుల కోసం పోలీసుల వేట కొనసాగుతోంది. మరికొందరి అరెస్టుకు రంగం సిద్ధమయినట్లు సమాచారం. సీపీ ఎకనామిక్ అఫెన్సెస్ వింగ్ పేరిట ప్రత్యేక పోలీసు బృందాన్ని ఏర్పాటు చేసి కబ్జాలపై విచారణ జరిపిస్తున్నారు. భూ కబ్జాలు, మోసాలు, బెదిరింపులకు సంబంధించి సీపీకి బాధితుల నుంచి 900 వరకు దరఖాస్తులు అందాయి. ఈ ఫిర్యాదులను విచారిస్తున్న పోలీసులు ఇప్పటికే ఐదు కేసులు నమోదు చేసి 10 మందిని అరెస్టు చేశారు. అరెస్టు అయిన వారిలో ఇద్దరు కార్పొరేటర్లు, మరో ఇద్దరు కార్పొరేటర్ల భర్తలు, ఒక మాజీ ఎంపీటీసీ, మాజీ ఆర్టీఏ మెంబరు, బీఆర్ఎస్ నాయకుడు, మరో ముగ్గురు వ్యక్తులున్నారు. బాధితుల ఫిర్యాదులపై విచారణ కీలకదశకు చేరుకుందని తెలిసింది. ఏసీపీల బదిలీలు జరగడంతో భూకబ్జా కేసుల విచారణలో కొంత జాప్యం జరిగే అవకాశముంది. రెండు మూడు రోజుల్లో కొత్త ఏసీపీలు బాధ్యతలు స్వీకరించిన అనంతరం కేసుల విచారణ వేగవంతం కానుంది.

● ముగిసిన తోట శ్రీపతిరావు కస్టడీ

భూకబ్జా కేసులో అరెస్టు అయి కరీంనగర్ జిల్లా జైలులో ఉన్న తోట శ్రీపతిరావును కరీంనగర్ రూరల్ పోలీసులు సోమవారం కస్టడీకి తీసుకుని విచారణ అనంతరం మంగళవారం తిరిగి కోర్టులో హాజరు పరచి జడ్జి ఆదేశాలతో జైలకు తరలించారు. కరీంనగర్‌లోని వివేకానందపురి కాలనీలో అనుమాండ్ల రవీందర్‌కు చెందిన నిర్మాణంలో ఉన్న భవనం ఎనిమిది పిల్లర్లను కూల్చివేత ఘటనకు సంబంధించిన కేసులో ఈ నెల 6న తోట శ్రీపతిరావును పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసుకు సంబంధించి తోట శ్రీపతిరావును మరింత లోతుగా విచరించేందుకు శ్రీపతిరావును కస్టడీకి తీసుకున్న పోలీసులు అతని ఇంటికి వెళ్లి సోదాలు జరిపి కీలకమైన డాక్యుమెంట్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. ఈ కేసులో మరి కొందరు వ్యక్తులను త్వరలో అరెస్టు చేయనున్నట్లు సమాచారం.

16న ఇంటర్ ఫస్ట్ ఇయర్ విద్యార్థులకు ప్రాక్టికల్ పరీక్ష

కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 13: జిల్లాలోని ఇంటర్ ఫస్టియర్ విద్యార్థులకు 16న ఆంగ్ల భాషలో నైపుణ్యం పెంచేందుకు ప్రాక్టికల్ పరీక్ష నిర్వహించాలని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధి కారి జగన్మోహన్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. 50 మందికి ఒక బ్యాచ్ చొప్పున ఈ ప్రాక్టికల్ పరీక్షను ఆయా కళాశాలల లెక్చరర్లు నిర్వహిం చాలని సూచించారు. 20 మార్కులతో నిర్వహిస్తున్న ఈ ప్రాక్టికల్ పరీక్షలో విద్యార్థులు ఏడు మార్కులు సాధించాల్సి ఉంటుంది. థియరీలో 80 మార్కులకు 28 వస్తేనే ఉత్తీర్ణులైనట్లు ప్రకటిస్తారని తెలిపారు. వొకేషనల్ విద్యార్థులకు ప్రాక్టికల్స్ 10 మార్కులకుగాను ఏడు మార్కులు రావాల్సి ఉంటుందని, థియరీలో 40కి 14 మార్కులు వస్తే ఉత్తీర్ణత సాధించినట్లని చెప్పారు. మార్కులు తక్కువ వచ్చినా, పరీక్షలకు హాజరు కాకపోయినా ఫెయిల్ అయినట్లు ప్రకటిస్తామని తెలిపారు.

వ్యవసాయ బావిలో మొసలి


బావి నుంచి బయటకు తీసిన మొసలి

రాయికల్, ఫిబ్రవరి 13: మండలంలోని దావన్‌పెల్లి గ్రామంలో కుర్ర శేఖర్ అనే రైతుకు చెందిన వ్యవసాయ బావిలో సోమవారం మొసలిని గుర్తించారు. ఈ సందర్భంగా భయాందోళనకు గురైన శేఖర్ గ్రామస్థుల సహాయంతో మొసలిని పట్టి అటవీ శాఖ అధికారులకు అప్పగించారు. వ్యవసాయ బావిలోని నీరు ఎండిపోవడంతో మొసలి కనబడిందని, లేకుంటే ప్రమాదం పొంచి ఉండేదని రైతులు పేర్కొంటున్నారు.

బద్ది పోచమ్మ ఆలయంలో భక్తుల రద్దీ


బోనం మొక్కు చెల్లించుకుంటున్న భక్తులు

వేములవాడ, ఫిబ్రవరి 13: రాజరాజేశ్వర స్వామివారి అనుబంధ దేవాలయమైన బద్ది పోచమ్మ ఆలయం మంగళవారం భక్తులతో కిటకిటలాడింది. మేడారం సమ్మక్కసారక్క జాతరకు వెళ్లడానికి ముందు ఆనవాయితీ ప్రకారం సోమవారం తమ ఇష్టదైవమైన రాజరాజేశ్వర స్వామిని దర్శించుకున్న వేలాది మంది భక్తులు మంగళవారం బద్ది పోచమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారు తెల్లవారుజామునే భక్తిశ్రద్ధలతో నైవేద్యం వండి బోనం తయారుచేసి ఊరేగింపుగా ఆలయం వద్దకు చేరుకున్నారు. బద్ది పోచమ్మ అమ్మవారికి బోనం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. భారీ సంఖ్యలో జనం తరలి రావడంతో క్యూలైన్లు కిక్కిరిసిపోయాయి. అమ్మవారి దర్శనానికి సుమారు రెండు గంటలకు పైగా సమయం పట్టింది.

అనారోగ్యంతో ఒకరి ఆత్మహత్య

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 13: అనారోగ్యంతో బాధపడుతున్న గౌతమి నగర్‌కు చెందిన అమ్మిగల్ల చంద్రయ్య(46) మంగళవారం ఆత్మహత్య చేసుకున్నాడని ఒకటో టౌన్ పోలీసులు తెలిపారు. మున్సిపల్‌లో కూలీగా పనిచేస్తున్న చంద్రయ్య అనారోగ్యంతో మందులు వాడుతున్నప్పటికీ నొప్పి తగ్గక పోవటంతో ఇంటిలో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు మృతుడి భార్య రజిత పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

విద్యుత్ చౌర్యం కేసులో ముగ్గురికి జైలు

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 13: విద్యుత్ చౌర్యం కేసులో ఇద్దరు నిందితులకు సోమవారం, మరొక నిందితుడికి మంగళవారం జిల్లా మొదటి అదనపు న్యాయమూర్తి శ్రీవాణి జైలు శిక్ష, జరిమానా విధించినట్లు ట్రాన్స్‌కో విజిలెన్స్ ఎస్ఐ టి నరేష్ తెలిపారు. తిమ్మాపూర్ మండలం పర్లపల్లికి చెందిన మామిడి అర్జున్‌కు 3,658 రూపాయల జరిమానా లేదా 3 నెలల సాధారణ జైలుశిక్ష, కొత్తపల్లి మండలం రేకుర్తికి చెందిన పొత్తూరి సుధాకర్‌కు 13,621 రూపాయల జరిమానా లేదా 3 నెలల సాధారణ జైలు శిక్ష విధించినట్లు తెలిపారు. మానకొండూర్ మండలం శ్రీనివాసనగర్‌కు చెందిన వరికోలు సంపత్‌కు 4,691 రూపాయల జరిమానా లేదా 3 నెలల సాధారణ జైలు శిక్ష విధించినట్లు తెలిపారు.

పీజీ మొదటి సెమిస్టర్ పరీక్షల షెడ్యూలు విడుదల

గణేశ్‌నగర్ ఫిబ్రవరి13: శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో జరగనున్న పీజీ మొదటి సెమిస్టర్, సిబిసిఎస్ రెగ్యులర్, బ్యాక్‌లగ్ పరీక్షలు ఈ నెల 27 నుంచి మార్చి2 వరకు జరగనున్నట్లు శాతవాహన విశ్వవిద్యాలయం పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ ఎస్‌వి శ్రీరంగప్రసాద్ తెలిపారు. పరీక్షలు మధ్యాహ్నం రెండు గంటల నుంచి సాయంత్రం వీ గంటల వరకు కొనసాగుతాయని తెలిపారు.

విద్యార్థుల ఆత్మహత్యలపై ప్రభుత్వం స్పందించాలి

గణేశ్‌నగర్,ఫిబ్రవరి 13: విద్యార్థుల ఆత్మహత్యలపై ప్రభుత్వం స్పందించాలని ధర్మ సమాజ్ పార్టీ(డిఎస్‌పి) ధర్మ స్టూడెంట్స్ యూనియన్(డిఎస్‌యు) నాయకులు గీతాభవన్ నుంచి కలెక్టరేట్ వరకు కొవ్వొత్తులతో నిరసన చేపట్టారు. సూర్యాపేట జిల్లా దురాజ్పల్లి సమీపంలోని ఇమాంపేట సాంఘిక సంక్షేమ బాలికల కళాశాలలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న దగ్గుబాటి వైష్ణవి ఆత్మహత్యపై సిట్టింగ్ జడ్జితో సమగ్ర విచారణ జరిపించి దోషులపై చట్టపరమైన చర్యలు తీసుకుని కఠినంగా శిక్షించాలని ధర్మ స్టూడెంట్స్ యూనియన్, ధర్మ సమాజ్ పార్టీ జిల్లా నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భువనగిరి వైష్ణవి, భవ్య, సూర్యాపేట దగ్గుపాటి వైష్ణవి, మాదాపూర్ నారాయణ ఐఐటి అకాడమీ వినయ్ విద్యార్థుల ఆత్మహత్యలకు కారకులైన అధికారులను శిక్షించాలని, విద్యార్థుల కుటుంబాలకు న్యాయం చేయాలని అన్నారు. ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా ప్రభుత్వం కఠినమైన చర్యలు తీసుకోవాలని కోరారు. దగ్గుబాటు వైష్ణవి ఆత్మహత్యపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించి ఆ కుటుంబానికి న్యాయం చేయకపోతే ధర్మ సమాజ్ పార్టీ, ధర్మ స్టూడెంట్స్ యూనియన్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కో కన్వీనర్ సదానందం, జిల్లా అధ్యక్షురాలు సాధన, జిల్లా ప్రధాన కార్యదర్శి నరేశ్, జిల్లా నాయకులు విద్యార్థులు పాల్గొన్నారు.

మోటార్‌సైకిల్ ఢీకొని యువకుడి మృతి


ఏలిమి పవన్ (ఫైల్)

హుజూరాబాద్, ఫిబ్రవరి 13: హుజూరాబాద్‌లోని పర్కాల క్రాస్‌రోడ్ సమీపంలో బస్సు దిగి నడుచుకుంటూ వెళ్తున్న ఓ యువకుడిని సోమవారం అర్ధరాత్రి మోటార్ సైకిల్ ఢీకొట్టింది. ఎల్కతుర్తి మండలం పెంచికల్‌పేట గ్రామానికి చెందిన ఏలిమి పవన్ (24) అనే యువకుడు పర్కాల క్రాస్ రోడ్ వద్ద బస్సు దిగి నడుచుకుంటూ వెళ్తున్నాడు. ఈ క్రమంలోనే వెనుక వైపు నుంచి వరంగల్ జిల్లా వాసి మోటర్ సైకిల్‌పై వస్తూ ఢీకొట్టాడు. దీంతో పవన్‌కు తీవ్ర గాయాలు కాగా వరంగల్‌కు తీసుకెళ్లగా, పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం హైద్రాబాద్‌కు తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతి చెందాడు. మృతుడి తండ్రి రవీందర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌చార్జీ టౌన్ సీఐ సంతోష్‌కుమార్ తెలిపారు.

ట్రాక్టర్ బోల్తా పడి ఇద్దరికి గాయాలు

వేములవాడ రూరల్, ఫిబ్రవరి 13: ట్రాక్టర్ బోల్తా పడి ఇద్దరు యువకులు తీవ్ర గాయాలపాలైన సంఘటన వేములవాడ మండలంలో మంగళవారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. ఎనుగంటి గ్రామానికి చెందిన ఏనుగుల గణేష్, నేరెళ్ల అజయ్ అనే యువకులు మంగళవారం సాయంత్రం ట్రాక్టర్ టైర్ పంచర్ చేయించుకుని ఎనుగంటి నుంచి హనుమాజీపేట వైపు వెళ్తున్నారు. మార్గమధ్యలో ట్రాక్టర్ అదుపు తప్పడంతో కల్వర్టు పైనుంచి ట్రాక్టర్ బోల్తాపడి ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు హుటాహుటిన స్థానిక ఆసుపత్రికి తరలించారు. సంఘటన స్థలాన్ని పరిశీలించిన పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు

కేంద్ర ప్రభుత్వ నిధులతోనే గ్రామాల్లో అభివృద్ధి

● బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్


కోనరావుపేటలో బండి సంజయ్‌ని సన్మానిస్తున్న ప్రజలు

కోనరావుపేట, ఫిబ్రవరి 13: గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి అంతా కేంద్ర ప్రభుత్వ నిధులతోనే జరుగుతున్నాయని, ప్రజల కోసం భారతీయ జనతా పార్టీ కొట్లాడితే కాంగ్రెస్‌కు ఓటేస్తారా అని దేశం అంతా ఆశ్చర్యపోతోందని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి ఎంపీ బండి సంజయ్ అన్నారు. కోనరావుపేట మండలంలోని నాగారం, కనగర్తి, నిజామాబాద్, కోనరావుపేట, నిమ్మపల్లి, మరిమడ్ల గ్రామాల్లో మంగళవారం ప్రజాహిత యాత్రను కొనసాగించారు. ఈ సందర్భంగా ప్రతి గ్రామంలో ప్రజలు మహిళలు పాల్గొని బండి సంజయ్‌కి స్వాగతం పలికారు. నాగారంలో శివాజీ విగ్రహానికి పూలమాలవేసి ప్రజాహితయాత్ర ప్రారంభించారు. అనంతరం నాగారం, కోనరావుపేటలో ప్రసంగించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అయోధ్యలో శ్రీరాముడి గుడి కడితే దేశమంతా ప్రజలు పూజలు చేశారు. జైశ్రీరామ్ అని నినాదాలు చేస్తున్నారన్నారు. నరేంద్ర మోదీ మనకు రేషన్ బియ్యం ఉచితంగా అందిస్తే మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఒక్క రూపాయి వసూలు చేస్తున్నాడని అన్నారు. ఎలా దోపిడీ చేయాలో అనేది కుట్రలు చేస్తూనే ఉంటాడన్నారు. వేములవాడ నియోజకవర్గానికి రూ.572 కోట్ల 91 లక్షల నిధులు కేంద్ర ప్రభుత్వం ఖర్చు చేసిందన్నారు. ఉపాధి పనుల కోసం 182 కోట్ల 80 లక్షల రూపాయలు కేటాయించామన్నారు. మెటీరియల్ ఖర్చు కోసం 86 కోట్లు మొక్కల పెంపకానికి రూ. 92 కోట్లు ఖర్చు పెట్టామని అన్నారు. ఇన్ని నిధులు కేటాయిస్తే మొక్కలు ఎక్కడ కనిపించడం లేదన్నారు. కేసీఆర్ ఈ పైసలు అన్నిటినీ దారి మళ్లించాడన్నారు. ఒక్క నాగారం గ్రామానికే నాలుగు కోట్లు ఖర్చు చేశామన్నారు. బీజేపీ కార్యకర్తలను కేసీఆర్ జైల్లో పెట్టించాడని ఇదంతా ప్రజల కోసమే చేశామని అన్నారు. ఈ ఎన్నికల్లో మోదీకి ఓటు వేసి గెలిపించాలన్నారు. టీఆర్ఎస్‌కు ఓటు వేస్తే మళ్లీ మోసపోతారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇంతవరకు రైతుబంధు, రుణమాఫీ వేయలేదని అన్నారు. మళ్లీ ఇప్పుడు ఎన్నికల కోడ్ వచ్చింది అని చెప్పి ఓట్లు వేయించుకుంటారని అన్నారు. అధికారులు కాళేశ్వరంపై సర్వే చేసి నివేదిక ఇచ్చినప్పటికీ కాంగ్రెస్ మంత్రులు హెలికాప్టర్‌లో కాలేశ్వరం వెళ్లొచ్చారు.. ఎందుకని ప్రశ్నించారు. కాంగ్రెస్ కృష్ణ నీటిపై, నల్గొండలో సభ పేరుతో బీఆర్ఎస్ నాటకాలు ఆడుతున్నాయన్నారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ లక్ష కోట్ల ధనాన్ని వృధా చేశానని ముక్కు నేలకు రాసి తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలని అన్నారు. పదేళ్ల పాలనలో కెసీఆర్ ఆస్తులు పెరిగాయని అన్నారు. రాష్ట్రాన్ని అప్పుల పాలు చేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా నాయకులు గోపాడి సురేందర్‌రావు, మిరియాల్‌కార్ బాలాజీ, రేగుల మల్లికార్జున్, మాజీ జడ్పీటీసీ పల్లం అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

ఏసీబీకి చిక్కిన శామీర్‌పేట తహసీల్దార్

● కరీంనగర్‌లోని ఇంటిలో సోదాలు

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 13: శామీర్‌పేట తహసీల్దార్ తోడేటి సత్యనారాయణ మంగళవారం 10 లక్షల రూపాయలు లంచం తీసుకుంటూ అవినీతి నిరోధకశాఖ(ఏసీబీ) పోలీసులకు హైదరాబాద్‌లో పట్టుబడ్డాడు. ఈ కేసుకు సంబంధించి కరీంనగర్‌లోని విద్యానగర్ ప్రాంతంలో సత్యనారాయణకు చెందిన ఇంటిలో కరీంనగర్ ఏసీబీ డీఎస్పీ రమణమూర్తి ఆధ్వర్యంలో పోలీసులు సోదాలు నిర్వహించి కొన్ని పత్రాలు సీజ్ చేశారు. సత్యనారాయణ భార్యను ఏసీబీ అధికారులు విచారించారు.


విద్యానగర్‌లోని శామీర్‌పేట తహసీల్దార్ నివాసంలో సోదాలు చేస్తున్న ఏసీబీ అధికారులు



అంతర్జాతీయ మాస్టర్ అథ్లెటిక్స్ ఎంపిక

కరీంనగర్ స్పోర్ట్స్, ఫిబ్రవరి 13: అంతర్జాతీయ మాస్టర్ అథ్లెటిక్స్ పోటీలకు జిల్లా కేంద్రానికి చెందిన సీనియర్ మాస్టర్ అథ్లెట్ ఎ.మధుసూదన్(74) ఎంపికయ్యారు. ఈనెల 8 నుంచి 11వరకు హైదరాబాద్ గచ్చిబౌలి స్టేడియంలో జరిగిన ఐదో జాతీయ మాస్టర్ అథ్లెటిక్స్ పోటీల్లో విశేష ప్రతిభచాటి అండర్-75 విభాగంలో ఐదు కిలోమీటర్ల వాకింగ్‌లో బంగారు పతకం, 400 మీటర్ల రిలే పరుగులో రజత పతకం సాధించిన ఆయన అంతర్జాతీయ పోటీలకు ఎంపికయ్యారని మాస్టర్ అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నీలం లక్ష్మన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయనను జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ పెరియాల రవీందర్‌రావు, సభ్యులు, వాకర్స్ జిల్లా యువజన క్రీడాశాఖ అధికారి కీర్తి రాజవీరు తదితరులు అభినందించారు.

జేఈఈ మెయిన్స్‌లో అల్ఫోర్స్‌కు ర్యాంకులు

కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 13: అల్ఫోర్స్ ఐఐటీ అకాడమీ తెలంగాణ, మహారాష్ట్ర విద్యార్థులు ఐఐటీ జేఈఈ మెయిన్స్ మొదటి విడత పరీక్ష ఫలితాల్లో సత్తా చాటారు. బి.ఆదిత్యారావు, జి.శ్రీహాస్, సుభోద్‌చౌదరి, ఎం.శ్రీరాం, ప్రణీత్, నిఖిల్‌చొప్రా, ఎ.శివవరుణ్, సిహెచ్ అనూహ్య, పి.రఘువీరరెడ్డి, సత్యఅమూల్య, షఫీక్, శివశంకరవరప్రసాద్, శ్రీనిధి, ఎం.ప్రహర్ష్, ఎం.పూనిత్ మనోహర్, రవిచంద్ర అద్భుతమైన పర్సంటైల్ సాధించారని అల్ఫోర్స్ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ వి నరేందర్‌రెడ్డి తెలిపారు.

జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో 'ఎస్ఆర్' ప్రభంజనం


డి.మనీష్


టి.తేజస్వి


కరీంనగర్‌లో విద్యార్థులను అభినందిస్తున్న ఎస్ఆర్ జోనల్ ఇన్‌చార్జి నేదూరి తిరుపతి

హనుమకొండ రూరల్, ఫిబ్రవరి 13 : అత్యంత ప్రతిష్ఠాత్మకమైన జేఈఈ మెయిన్స్ 2024 (సీజన్-1) ఫలితాల్లో ఎస్ఆర్ విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులు ప్రభంజనం సృష్టించినట్లు ఎస్ఆర్ విద్యా సంస్థల చైర్మన్ ఎ.వరదారెడ్డి తెలిపారు. మంగళవారం విడుదలైన ఫలితాల్లో జాతీయ స్థాయిలో దొంతుల మనీష్ 99.99 శాతం పర్సంటైల్ సాధించి ఎస్ఆర్ విద్యాసంస్థల కీర్తి ప్రతిష్ఠలను జాతీయస్థాయిలో నిలబెట్టినట్లు తెలిపారు. అలాగే తుమ్మ తేజస్వీ 99.95 శాతం, ఆర్.దీపాన్షరెడ్డి 99.19 శాతం, పి.నిహాల్ శ్రీవాత్సవ్ 99.91 శాతం సాధించినట్లు తెలిపారు. భవిష్యత్‌లో అత్యుత్తమైన ర్యాంకులు సాధించేలా విద్యార్థులను తీర్చిదిద్దుతామన్నారు. ఈ సందర్భంగా ర్యాంకులు సాధించిన విద్యార్థులను వరదారెడ్డి అభినందించారు.

ప్రతిభ చాటిన అలుగునూర్ ఎస్ఆర్ కళాశాల విద్యార్థులు

తిమ్మాపూర్: జేఈఈ మెయిన్ ఫలితాల్లో కరీంనగర్ పరిధిలోని అలుగునూర్‌లో గల ఎస్ఆర్ జూనియర్ కళాశాలకు చెందిన 9 మంది విద్యార్థులు 90 పర్సంటైల్ సాధించి జాతీయ స్థాయిలో సత్తా చాటారని ఎస్ఆర్ విద్యా సంస్థల జోనల్ ఇంచార్జ్ నేదూరి తిరుపతి తెలిపారు. మంగళవారం కళాశాల ప్రాంగణంలో ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. కళాశాలకు చెందిన జి.రాజీవ్(99.2) పర్సంటైల్‌తో అత్యున్నత ప్రతిభ కనబరచగా, జి.శ్రీవాత్సవ్(98.5), ఎన్.వినూత్న(98.22), బి.రిషిత్(98), బి.క్షేత్ర(96.5), డి.రోహన్(96), ఏ.అశ్వక్(94.09),కె.ఒమేశ్వర్(92.21), వి.శ్రీహరిణి(90) పర్సెంటైల్ సాధించినట్లు తెలిపారు. విద్యార్థులను ఎస్ఆర్ విద్యా సంస్థల చైర్మన్ వరదారెడ్డి, డైరెక్టర్లు మధుకర్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి, ప్రిన్సిపాల్స్ నాగార్జునరెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, మారుతి, శ్రీనివాస్‌రెడ్డి అధ్యాపకులు అభినందించారు.

జేఈఈ మెయిన్స్‌లో ట్రినిటి ప్రతిభ


వర్షితరాణి


శ్రీతేజ

కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 12: జేఈఈ మెయిన్స్ సెషన్-1 ఫలితాల్లో ట్రినిటి కళాశాల విద్యార్థులు విజయ దుందుభి మోగించారు. కళాశాల ఆవరణలో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ట్రినిటి విద్యాసంస్థల ఫౌండర్ అండ్ చైర్మన్ దాసరి మనోహర్‌రెడ్డి, చైర్మన్ ప్రశాంత్‌రెడ్డి విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రణాళికతో, అకుంఠిత దీక్షతో ఉత్తమ ఫలితాలు సాధించామన్నారు. ఫలితాల్లో వర్షితరాణి 99.53 పర్సంటైల్, వి.శ్రీతేజ 98.49 పర్సంటైల్, ఎం.మణితేజ 97.75 పర్సంటైల్ సాధించారన్నారు. మరెన్నో ఉత్తమమైన ఆమోదయోగ్యమైన ఫలితాలు సాధించామన్నారు. ఒత్తిడి లేని విద్యా విధానంతో చక్కని ప్రణాళికతో విద్యను అందిస్తున్నామన్నారు.

ప్రజాస్వామ్య ప్రక్రియను నిలబెట్టడమే కాంగ్రెస్ లక్ష్యం

● ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

జగిత్యాల టౌన్, ఫిబ్రవరి 13: ప్రజాస్వామ్య ప్రక్రియను నిలబెట్టడమే కాంగ్రెస్ పార్టీ ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఇందిరాభవన్‌లో మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. స్థానిక సంస్థల్లో సామాజికంగా మహిళలకు ప్రాధాన్యత కల్పించాలని ఆనాడు స్వర్గీయ రాజీవ్ గాంధీ ఆధ్వర్యంలో 73, 74 రాజ్యాంగ సవరణ ద్వారా మూడవ వంతు రిజర్వేషన్ కల్పించారన్నారు. స్థానిక సంస్థల్లో ఏ పదవి ఖాళీ అయినా దానిని ఆరు నెలల్లో ఎన్నిక ద్వారా భర్తీ చేయాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానికి ఉంటుందన్నారు. కానీ జగిత్యాలలో మాత్రం ఇవేమీ పాటించకుండా బీఆర్ఎస్ ప్రభుత్వం కాలం గడిపిందన్నారు. జగిత్యాల రూరల్ ఎంపీపీ కరోనాతో మృతి చెందగా, జగిత్యాల బల్దియా చైర్ పర్సన్ బోగ శ్రావణి తన పదవితో పాటు కౌన్సిలర్ పదవికి రాజీనామా చేయడంతో పదవులు ఖాళీ అయినా ఆ స్థానాలకు ఎన్నిక నిర్వహించకపోవడంతో మహిళలకు కేటాయించిన రిజర్వేషన్ హక్కులు కోల్పోతున్నారన్నారు. బీసీలకు కేటాయించిన సీట్లలో ఉన్నత వర్గాలకు చెందిన వారు కొనసాగుతుండడంతో బీసీలు తమ హక్కులను కోల్పోతున్నారన్నారు. పీసీసీ సభ్యుడు గిరి నాగభూషణం, బండ శంకర్ ఉన్నారు.

ఖాతాదారుల డబ్బులు కాజేస్తున్న సైబర్ మోసగాళ్లు

● ధర్మారం మండలంలో వరుస ఘటనలు
● తాజాగా రూ.29,500 డ్రా

ధర్మారం,ఫిబ్రవరి13: సైబర్ నేరగాళ్లు బ్యాంకు ఖాతాదారులపై కన్నేశారు. బ్యాంకులో డబ్బులున్నాయని అవసరానికి తీసుకుందామని వెళ్తే ఖాతా ఖాళీకావడంతో అవాక్కవుతున్నారు. తమకు తెలియకుండా డబ్బులు డ్రా చేశారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పెద్దపల్లి జిల్లాలోని ధర్మారం మండలం నందిమేడారంలో సందినేని పవన్‌కుమార్ ఎస్‌బీఐ ఖాతాలో నుంచి అతనికి తెలియకుండానే రూ. 10వేలు డ్రా కావడంతో పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. తాజాగా మంగళవారం మరో మోసం కేసు నమోదైంది. ధర్మారం మండలంలోని బొట్లవనపర్తి గ్రామానికి చెందిన దారవేని పోచాలు ఎస్‌బీఐ ఖాతా నుంచి మూడు విడతలుగా ఏఈపీఎస్(ఆధార్ ఎనేబుల్డ్ మెమెంట్) ద్వారా రూ.29వేల 500లను సైబర్ నేరగాళ్లు డ్రా చేసినట్టు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తన ఖాతా నుంచి తనకు తెలియకుండా గత ఏడాది డిసెంబరు31న రూ.10వేలు, ఈ ఏడాది జనవరి 2న రూ. 9వేల 500, జనవరి 4న రూ.10వేలు మొత్తం రూ. 29వేల 500 డ్రా జరిగినట్టు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో వివరించాడు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్సై సత్యనారాయణ తెలిపారు.

విచారణ చేస్తున్న పోలీసులు

ధర్మారం మండలంలో ఇద్దరి ఎస్‌బీఐ ఖాతాలో నుంచి రూ.39వేలను వేర్వేరు తేదీలలో సైబర్ నేరగాళ్లు డ్రా చేయడంతో పోలీసులు విచారణ చేస్తున్నారు. ఒక వైపు సైబర్ నేరాలను అరికట్టేందుకు పోలీసులు ప్రజలకు అవగాహన కల్పిస్తున్నా ప్రజలు ఎక్కడో ఒకచోట మోసపోతూనే ఉన్నారు. సైబర్ నేరగాళ్లు పోలీసులకు సవాలు విసురుతున్నారు. ఇటీవల ఎక్కువగా భూముల రిజిస్ట్రేషన్ చేసే సమయంలో వేలిముద్రలను ఉపయోగిస్తుండడంతో ఆ కోణంలో పోలీసులు విచారణ చేస్తున్నారు. అంతే కాకుండా కంప్యూటర్ సెంటర్‌లలో కూడా ఎవరైనా ఈ నేరాలకు పాల్పడుతున్నారా? అనే కోణంపై పోలీసులు దృష్టి సారించారు. బ్యాంకు ఖాతాల్లో భద్రంగా డబ్బులుంటాయని నమ్మకం లేకుండా సైబర్ నేరగాళ్లు చేస్తున్న మోసాలకు బ్యాంకు ఖాతాదారులు భయాందోళన చెందుతున్నారు. మోసాలపై పోలీసులు విచారణ వేగవంతం చేశారు.

రైతుబంధు పేరుతో మోసం

కొడిమ్యాల, ఫిబ్రవరి 13: మండలంలోని నాచుపల్లిలో సోమవారం జరిగిన ఆన్‌లైన్ మోసంలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురి ఖాతా నుంచి రూ.1.25 లక్షలు మోస పోయారు. బాధితులు తెలిపిన వివరాల మేరకు నాచు పల్లి గ్రామానికి చెందిన గాజర్ల సౌమ్యకు రైతు బంధు డబ్బులు 21 వేలు మంజూరయ్యాని గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేసి బ్యాంక్ వివరాలు కోరాడు. వివరాలు అందు బాటులో లేకపోవటంతో ఇంటి పక్కనే ఉన్న సంధ్య అనే మహిళ బ్యాంక్ వివరాలను సదరు వ్యక్తికి తెలిపింది. బ్యాంక్ ఖాతాకు పూర్తి వివరాలు సరిపోవటం లేదని మళ్లీ ఫోన్ రావటంతో సంధ్య కుటుంబ సభ్యులైన సుమన్, రమేష్‌కు చెందిన బ్యాంక్ వివరాలు తెలిపారు. కొద్ది సేపటికి ముగ్గురి ఖాతాలో నుంచి రూ.1,25,408 రూపాయలు కట్ అయ్యాయి. మోసపోయినట్లు గుర్తించిన బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

విద్యుత్ కంచె అమర్చిన వ్యక్తి రిమాండ్

రుద్రంగి, ఫిబ్రవరి 13: అటవీ జంతువుల వేట కోసం విద్యుత్ తీగలు అమర్చిన గుగులోతు తిరుపతిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై అశోక్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. రుద్రంగి మండలం రూప్లానాయక్ తండా శివారులోని గుగులోతు తిరుపతి పంటకు విద్యుత్ కంచె ఏర్పాటు చేశాడు. దీంతో హరిసింగ్ అనే రైతుకు చెందిన గేదె కంచెకు తగలడంతో విద్యుత్ షాక్ గురై అక్కడిక్కడే మృతి చెందింది. హరిదాస్ ఫిర్యాదుతో తిరుపతిపై ఆదివారం కేసు నమోదు చేశారు. విచారణ ఆనంతరం మంగళవారం తిరుపతిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు. ఎవరైనా పొలాలకు విద్యుత్ కంచెలను అమరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

బోయినపల్లి, ఫిబ్రవరి 13: రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బోయినపల్లి మండలం వరదవెల్లి గ్రామానికి చెందిన రాజనర్సు (60) మంగళవారం పరిస్థితి విషమించి మృతి చెందాడు. గ్రామానికి చెందిన రాజనర్సు (60), శివయ్య, అనంత రెడ్డి ఈ నెల 8న కూలి పని కోసం వరదవెల్లి వచ్చారు. రోడ్డు పక్కన ముగ్గురు మాట్లాడుకుంటుండగా పెగడపల్లి మండలం బత్కపల్లికి చెందిన మారుతి కారు అతివేగంగా వచ్చి ముగ్గురిని ఢీకొట్టింది. ముగ్గురికి గాయాలు కాగా రాజనర్సు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

పెగడపల్లి, ఫిబ్రవరి 13: పెగడపల్లి మండలంలోని లింగాపూర్ గ్రామానికి చెందిన పొన్నం లచ్చయ్యకు చెందిన గేదె మంగళవారం విద్యుదాఘాతంతో మృత్యువాత పడింది. ఇంటి ముందు స్తంభానికి కట్టివేసిన గేదెపై ప్రమాదవశాత్తు విద్యుత్ వైరు తెగిపడి మృతి చెందినట్లు గ్రామస్థులు, బాధిత రైతు తెలిపారు. రూ.50 వేలు విలువ చేసే గేదె మృత్యువాత పడటంతో బాధిత రైతు కన్నీరు మున్నీరుగా విలపించారు. రైతుకు ప్రభుత్వం విద్యుత్ శాఖ పరిహారం అందించి ఆదుకోవాలని ఎంపీటీసీ పూసాల శోభాతిరుపతి, రైతులు కోరారు.



పిల్లలు పుట్టడం లేదని ఆత్మహత్య


సల్లె రమేష్(ఫైల్)

సుల్తానాబాద్, ఫిబ్రవరి 13: వివాహం జరిగి ఎనిమిది సంవత్సరాలు కావస్తున్నా పిల్లలు పుట్టడం లేదని మనస్తాపం చెందిన ఓ యువకుడు రైల్వేట్రాక్ పక్కనున్న ట్రాన్స్‌ఫార్మర్‌ను ముట్టుకుని మంగళవారం ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై వినీత తెలిపారు. సుల్తానాబాద్‌కు చెందిన సల్లె రమేష్ (33)కు స్రవంతితో వివాహం జరిగి ఎనిమిది సంవత్సరాలు అవుతోంది. అయితే వీరికి సంతానం లేకపోవడంతో మనస్తాపం చెందిన రమేష్ మద్యంకు బానిసగా మారాడు. ఇంట్లో తల్లి, అతని భార్య తాగుడు వద్దని చెప్పినా పెడచెవిన పెట్టేవాడు. మంగళవారం ఉదయం ఇంట్లో నుంచి వెళ్లిన రమేష్ మద్యం తాగి ఇంటికి రాగా తల్లి సమ్మక్క మందలించడంతో ఇంటి వెనకాల రైల్వే ట్రాక్ పక్కనున్న ట్రాన్స్‌ఫార్మర్‌ను పట్టుకుని ఆత్మహత్య చేసుకున్నాడని ఎస్ఐ వివరించారు. మృతునికి భార్య స్రవంతి, తల్లి సమ్మక్క ఉన్నారు. తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సుల్తానాబాద్ ప్రభుత్వ అసుపత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో..

వెల్గటూర్, ఫిబ్రవరి 13: ఆర్థిక ఇబ్బందులు తాళలేక తాళ్లకొత్తపేట గ్రామా నికి చెందిన ఎల్కటూరి లక్ష్మీనారాయణ (35) అనే వ్యక్తి సోమవారం రాత్రి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై ఉమాసాగర్ తెలిపిన వివరాల ప్రకారం మృతుడు లక్ష్మీనారాయణ గత కొద్ది రోజులుగా ఆర్థిక ఇబ్బందులతో బాధపడు తున్నాడు. ఈ క్రమంలో సోమవారం రాత్రి ఇంటిలో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతునికి భార్య సౌందర్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుని భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

చిన్నకల్వలలో యువకుడు..


సుధీర్‌రావు (ఫైల్)

సుల్తానాబాద్, ఫిబ్రవరి 13: సుల్తానాబాద్ మండలంలోని చిన్నకల్వల గ్రామంలో గౌరవెల్లి సుధీర్‌రావు (30) అనే యువకుడు మంగళవారం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.ఇంట్లో ఎవరూ లేని సమయంలో సుధీర్‌రావు మంగళవారం ఉదయం ఉరి వేసుకోవడంతో సాయంత్రం సంఘటన వెలుగు చూసింది. భార్య అవణి కొన్నిరోజుల క్రితం అమె పుట్టింటికి వెళ్లింది. తల్లి స్వర్ణ అలియాస్ పద్మ సుగ్లాంపల్లిలో అంగన్ వాడీ టీచర్‌గా పనిచేస్తోంది. దీంతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో సుధీర్‌రావు ఆత్మహత్యకు పాల్పడ్డారు. వివరాలు తెలియాల్సి ఉంది. మృతునికి భార్య, కుమారుడు ఉన్నారు.

'పీఎం విశ్వకర్మ యోజనను సద్వినియోగం చేసుకోవాలి'

సుభాష్‌నగర్, ఫిబ్రవరి 13: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎం విశ్వకర్మ యోజనను సద్వినియోగం చేసుకోవాలని తెలంగాణ బీసీ జనసేన రాష్ట్ర అధ్యక్షుడు తిపారపు ఆంజనేయులు అన్నారు. ఈ పథకం పట్ల గ్రామీణ, పట్టణ స్థాయిలో విస్తృతంగా అవగాహన చేపట్టాలని కోరారు. చేతి, కుల వృత్తులపై ఆదారపడి జీవనం సాగిస్తున్న వారిలో సామర్థ్యం మెరుగుపరిచి ఉత్పాదకత నాణ్యత ఉత్పత్తులను పెంచడం ఈ పథకాన్ని ఉద్దేశ్యమన్నారు. ఈ పథకంలో చేరడం వల్ల విశ్వకర్మ సర్టిఫికెట్, ఐడీ కార్డు, టూల్ కిట్, రుణసదుపాయం డిజిటల్ లావాదేవీలకు ప్రోత్సాహకం, మార్కెటింగ్ చేసుకొనుటకు ప్రభుత్వ మద్దతు లభిస్తుం దన్నారు. సూక్ష్మ, చిన్న, మధ్యతరహా వ్యాపారాల ద్వారా కుల వృత్తులు చేసుకొని ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు ఆర్థిక చేయూత నందిస్తుం దన్నారు. 18 సంవత్సరాలు పైబడిన వారు అర్హులని ఎలాంటి విద్యార్హత లేకున్నా పేరు నమోదు చేసుకోవచ్చన్నారు. విశ్వకర్మగా పేరు నమోదు కొరకు సమీపంలోని కామన్ సర్వీస్ సెంటర్ ద్వారా ఆన్‌లైన్‌లో రేషన్ కార్డు, ఆధార్‌కార్డు, బ్యాంకు పాస్‌బుక్కు, మొబైల్ నెంబరుతో రిజిస్టర్ చేసుకోవాలని ఆయన సూచించారు.

ప్రజాక్షేత్రంలో గెలవలేకనే బండి సంజయ్ ఆరోపణలు

-మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్

సుభాష్‌నగర్, ఫిబ్రవరి 13: ప్రజాక్షేత్రంలో గెలవలేకనే ఎంపీ ఎంపీ బండి సంజయ్‌కుమార్ ఆరోపణలు చేస్తున్నారని మాజీ ఎంపీ బోయినిపల్లి వినోద్ కుమార్ అన్నారు. మంగళవారం నగరంలో వినోద్‌కుమార్ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పార్లమెంట్‌కు ఎన్నికైన వ్యక్తి గాలి మాటలు మాట్లాడకూడదన్నారు. బండి సంజయ్‌కుమార్ చేపట్టిన యాత్రలో విలేకరులతో మాట్లాడుతూ మేడిగడ్డ ప్రాజెక్టు నిర్మాణంలో మాజీ ఎంపీ ఎల్‌అండ్‌టీ సంస్థను బెదిరించి సబ్ కాంట్రాక్టు ఇప్పించుకున్నారని ఆరోపించడం దారుణమన్నారు. సబ్ కాంట్రాక్టు ఇప్పించుకున్న వ్యక్తి ఎవరో బండి సంజయ్‌కుమార్ చెప్పాలని సూటిగా ప్రశ్నించారు. ఎంపీగా గెలిచిన వ్యక్తి నియోజకవర్గానికి ఇప్పటి వరకు కనీసం 5 రూపాయలు కూడా తీసుకురాలేదన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ మేడిగడ్డ పర్యటన మంచిదేనని, అది ఎందుకు కుంగిందో ముఖ్యమంత్రి తేల్చాలన్నారు.

నేడు ప్రేమికుల దినోత్సవం

కరీంనగర్ కల్చరల్, ఫిబ్రవరి 13: ప్రపంచ స్థితి గతులను మార్చగల శక్తి ప్రేమకు ఉంది. కావ్యాలు, గ్రంథాలు, భావ వ్యక్తీకరణలు సమస్తం ప్రేమ చుట్టే అల్లుకున్నాయి. ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 14న ప్రేమికుల దినోత్సవాన్ని జరుపు కుంటారు. ప్రేమికులు సంబరాల్లో భాగంగా పరస్పరం కానుకలు ఇచ్చి పుచ్చుకుంటారు.

కుక్కపిల్లలను రక్షించిన అగ్నిమాపకశాఖ సిబ్బంది

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 13: రెండు గోడల మధ్య ఇరుక్కపోయిన కుక్కపిల్లలను రక్షించాలంటూ కరీంనగర్ ఫైర్ స్టేషన్‌కు మంగళవారం రాత్రి ఒక ఫోన్ వచ్చింది. వెంటనే స్పందించిన కరీంనగర్ ఫైర్ ఆఫీసర్ పరమేశ్వర్ వెంటనే సిబ్బందిని పంపించి గోడను కొంత వరకు తవ్వి ఇరుక్కు పోయిన కుక్క పిల్లలను రక్షించారు. ఈ సంఘటన కరీంనగర్ శివారులోని శాతవాహన విశ్వవిద్యాలయం మల్కాపూర్ రోడ్‌లో జరిగింది. రక్షించిన కుక్క పిల్లలను యజమానికి అప్పగించామని ఫైర్ ఆఫీసర్ పరమేశ్వర్ తెలిపారు.

బీజేపీ నాయకులకు ఘన స్వాగతం

జమ్మికుంట, ఫిబ్రవరి 13: అయోధ్యకు వెళ్లి శ్రీరాముడి దివ్య దర్శనం చేసుకొని వచ్చిన బీజేపీ నాయకులు, భక్తులకు స్థానిక రైల్వేస్టేషన్‌లో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ హిందువుల ఆరాధ్య దైవం అయిన శ్రీరాముడు పుట్టిన అయోధ్యలో రామ మందిరం నిర్మించడం ఐదు వందల ఏళ్ల కోరిక అన్నారు. ఆలయ నిర్మాణ పోరాటంలో అనేక మంది హిందువులు మృతి చెందారన్నారు. బీజేపీ ఎన్నికల మెని ఫెస్టోలో రామ మందిర నిర్మాణం ఒక ప్రధాన అంశం అన్నారు. కోట్లాది మంది హిందువుల కోరికను ప్రధానమంత్రి మోడి సహకారం చేశారన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు ఎరబెల్లి సంపత్‌రావు, మాజీ చైర్మన్ శీలం శ్రీనివాస్, పట్టణ అధ్యక్షులు జీడి మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాది కుటుంబానికి ఆర్థిక సాయం

కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 13: కరీంనగర్ బార్ అసోసియేషన్ సభ్యుడు న్యాయవాది సుంకె సత్తయ్య గత సంవత్సరం మరణించగా ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్, అడ్వకేట్ వెల్ఫేర్ ఫండ్ ఆఫ్ బార్ కౌన్సిల్‌ఆధ్వర్యంలో ఆర్థిక సాయం అందించారు. ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ ఆధ్వర్యంలో 35 వేలు, అడ్వకేట్ వెల్ఫేర్ ఫండ్ ఆఫ్ బార్ కౌన్సిల్ ఆధ్వర్యంలో 30 వేల చెక్కును మంగళవారం సత్తయ్య భార్యకు అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు గడ్డం లక్ష్మణ్, జెల్ల రమేష్, బండపల్లి శ్రీధర్, దాసం శ్రీదర్, బోగం శంకర్, బండపల్లి శ్రీకాంత్, సుంకె దేవకిషన్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రథోత్సవం

వీణవంక,ఫిబ్రవరి 13:మండలంలోని మామిడాలపల్లి గ్రామంలోని వేంకటేశ్వర ఆలయంలో సుదర్శన యజ్ఞ రథోత్సవం వైభవంగా నిర్వహించారు.ఈ సందర్బంగా బలిహరము రథోత్సవ సామూహిక పూజ కార్యక్రమము నమిలికొండ రమణ చార్యులు చేపట్టారు. ఈ కార్యక్రమములో పండితులు ఆలయ కమిటీ చైర్మన్ దాచేపల్లి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సమ్మక్క-సారలమ్మ జాతర పోస్టర్ ఆవిష్కరణ

ఇల్లందకుంట, ఫిబ్రవరి 13: ఇల్లందకుంట మండలంలోని మల్యాల గ్రామంలో ఈ నెల 21 నుంచి 24వ తేదీ వరకు జరిగే సమ్మక్క-సారలమ్మ జాతర పోస్టర్ ను జడ్పీ చైర్‌పర్సన్ కనుమల్ల విజయ మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జాతర సమయంలో భక్తులకు ఎలాంటి ఇబ్బం దులు కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. కార్యక్రమంలో జాతర కమిటీ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

కెమిస్ట్రీతో అనేక రంగాల్లో ఉజ్వల భవిష్యత్తు

హుజూరాబాద్ రూరల్, ఫిబ్రవరి 13: కెమిస్ట్రీతో అనేక రంగాల్లో ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని శాతవాహన ప్రొఫెసర్ కె రాజు అన్నారు. మంగళవారం మండలంలోని సింగాపూర్‌లోని వీఎస్సార్ డిగ్రీ కళాశాలలో కెమిస్ట్రీ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో సెమినార్ నిర్వహించారు. రసాయన శాస్త్రంలో పరిశోధనలు చేసి అంతర్జాతీయ స్థాయిలో నోబుల్ బహుమతి పొందిన శాస్త్రవేత్తలను గుర్తు చేశా రు. ప్రభుత్వ, ప్రైవేట్, కార్పొరేట్ రంగాల్లో ఎక్కువగా ఉద్యోగ అవకాశాలున్నా యన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ హనుమకుమార్, అధ్యాపకుడు తిరుపతి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సహాయం అందించిన కాంగ్రెస్ నాయకులు

చొప్పదండి, ఫిబ్రవరి 13: మండలంలోని ఆర్నకొండ గ్రామానికి చెందిన గీకురు శేఖర్ మరణించగా, కాంగ్రెస్ నాయకులు రూ. 5వేల ఆర్థిక సహాయాన్ని అందచేశారు.ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఆదేశాల మేరకు శేఖర్ కుటుంబ సభ్యుల ను పరామర్శించారు. నగదును అందచేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువ జన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కొత్తూరు మహేశ్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఇప్ప శ్రీనివాస్‌రెడ్డి, గ్రామ అధ్యక్షుడు ఎల్లాల ఆదిరెడ్డి, నాయకులు సోమిడి శ్రీని వాస్, గడబల్ల గంగారాం, తిరుపతిరెడ్డి, తాండ్ర వేణుగోపాల్ పాల్గొన్నారు.

'భయబ్రాంతులకు గురిచేస్తే సహించేది లేదు'

జమ్మికుంట రూరల్, ఫిబ్రవరి 13: భయబ్రాంతుకు గురి చేయాలని చూస్తే సహించేది లేదని బీఆరెస్, కాంగ్రెస్ పార్టీలకు చెందిన చైర్మన్, కౌన్సిలర్లు పరస్పర విమర్శలకు దిగారు. మంగళవారం పట్టణంలో వేర్వేరుగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశాల్లో వారు మాట్లాడారు. మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపల్లి రాజేశ్వర్‌రావు అవిశ్వాస సమయంలో తనకు సపోర్ట్ చేయలేదనే అక్కసుతో తనపై దాడికి యత్నించారన్నారు. తమ బంధువుల వివాహ వేడుకకు తాను హాజరు అయ్యానని, ఆ సమయలో అక్కడే ఉన్న చైర్మన్ తనను బ్రోకర్‌గా పని చేస్తున్నావంటూ అవమానించాడన్నారు. 30మంది కౌన్సిలర్లు భిక్ష వేస్తే చైర్మన్ అయ్యాడని మర్చిపోయి ఇష్టం వచ్చినట్లు మాట్లాడటం బాధాకరం అన్నారు. బెది రింపులకు పాల్పడితే సహించే ప్రసక్తి లేదని, పోలీస్‌స్టేషన్లో చైర్మన్‌పై ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కౌన్సిలర్ రావికంటి రాజు కావాలనే తనపై కవ్వింపు చర్యల కు పాల్పడుతున్నాడని, అవిశ్వాస సమయంలో తన దగ్గర నుంచి ఐదు లక్షలు తీసుకున్నాడని చైర్మన్ తెలిపారు. నాతోనే ఉండి నా దగ్గర డబ్బులు తీసుకుని తన బిడ్డ పెళ్లి రోజు అవిశ్వాసం పెట్టారని గుర్తు చేశారు. తాను ఏం అవినీతి చేశానో దమ్ముంటే బయట పెట్టాలని సవాల్ విసిరారు. అడిగిన డబ్బులు ఇవ్వక పోవడం వల్లే తనను బ్లాక్ మెయిల్ చేస్తున్నారని చెప్పారు. కేసులు తప్పించుకు నేందుకు ఎవరు పార్టీ మారారో ప్రజలకు తెలుసు అన్నారు. భయ బ్రాంతులకు గురి చేస్తున్న కౌన్సిలర్‌పై పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. వేర్వేరుగా జరిగిన సమావేశాల్లో సొసైటీ చైర్మన్ పొనగంటి సంపత్, కౌన్సిలర్ పొనగంటి మల్లయ్య, ఇతర కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మానవత్వాన్ని చాటిన ట్రాన్స్‌జెండర్

వీణవంక, ఫిబ్రవరి 13:మండలంలోని హిమ్మత్‌నగర్ గ్రామానికి చెందిన దుకిరే రాజు ఇటీవల వ్యవసాయ పనులకు వెళ్లి మృతి చెందగా వారి కుటుం బాన్ని ట్రాన్స్‌జెండర్ గాజుల హరిత పరమర్శించారు. ఈ సందర్బంగా వారి కుటుంబ సభ్యులను మృతికి గల వివరాలు తెలుసుకొని ఐదు వేల రూపాయల ఆర్థిక సాయం అందించి మానవత్వాన్ని చాటారు.

కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న కేంద్రం

- వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి సృజన్‌కుమార్


డీఆర్‌డీవోకు సమ్మె నోటీసు అందిస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

భగత్‌నగర్, ఫిబ్రవరి13: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి కొయ్యడ సృజన్‌కుమార్ విమర్శించారు. ఈ నెల 16న నిర్వహించ తలపెట్టిన భారత్ బంద్‌ను జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి కొయ్యడ సృజన్ కుమార్ పిలుపునిచ్చారు. భారత్ బంద్‌లో ఉపాధి హామీ కూలీలు పాల్గొంటారని, పనులు నిలిపి వేయాలని మంగళవారం డీఆర్‌డీవో శ్రీలతకు సమ్మె నోటీసు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని కొయ్యడ సృజన్‌కుమార్ అన్నారు. రైతు వ్యవసాయ కార్మిక వ్యతిరేక విధానా లను అవలంబిస్తూ పెట్టుబడి దారి వర్గాలకు కొమ్ము కాస్తోందని ఈసందర్భంగా ఆయన ఆరోపించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు బోయిని అశోక్, రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి పైడిపల్లి రాజు, నాయకులు కంది రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నల్గొండ సభకు తరలిన బీఆర్ఎస్ శ్రేణులు

కరీంనగర్‌టౌన్, ఫిబ్రవరి 13: నల్గొండ సభకు కరీంనగర్ శాసన సభ్యులు గంగుల కమలాకర్ ఆధ్వర్యంలో నగరంలోని మీసేవా కార్యాలయం నుంచి బీఆర్ఎస్ శ్రేణులు భారీగా తరలి వెళ్లారు.

●కరీంనగర్ రూరల్, ఫిబ్రవరి13: నల్లగొండలో నిర్వహిస్తున్న బీఆర్ఎస్ సభకు కొత్తపల్లి మండలంలోని చింతకుంట గ్రామ బీఆర్ఎస్ కార్యకర్తలు పెద్దఎత్తున తరలి వెళ్లారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ బూక్యా తిరుపతి నాయక్, రేణికుంట రాజు చాంద్‌పాషా, పైడిపాల సతీష్, బానోత్ శ్రీకాంత్, గాంధినగర్ మల్లేశం, ఫాహిం వాజిత్ రేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు వసంత పంచమి పూజలు

కరీంనగర్ కల్చరల్, ఫిబ్రవరి 13: నగరంలోని యజ్ఞవరాహక్షేత్రంలో వసంతపంచమి సందర్భంగా బుధవారం ఉదయం 6.30 గంటల నుంచి వసుధాలక్ష్మి, వరదుర్గ, వాగ్వాదిని మహాసరస్వతి అమ్మవార్లకు అభిషేకం, అనంతరం సారె సమర్పణ, కుంకుమార్చన, 11 గంటలకు సామూహిక అక్షరాభ్యాసాలుంటాయని ఎస్‌విఎస్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ శ్రీభాష్యం వరప్రసాదశర్మ ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు, విద్యార్థులు పాల్గొని తరించాలని కోరారు.

శ్రీరాముడి చిత్రపటాల అందజేత

భగత్‌నగర్, ఫిబ్రవరి13: నగరంలోని అశోక్‌నగర్‌లో అసెంబ్లీ కన్వీనర్ దుబాల శ్రీనివాస్ శ్రీరాముని చిత్ర పటాలను 18వ డివిజన్ ఇన్‌ఛార్జి జాడిబాల్‌రెడ్డికి అందించారు. కరీంనగర్ పార్లమెంట్ సభ్యుడు బండి సంజయ్‌కుమార్ ఆదేశానుసారం అయోధ్య రాముని చిత్ర పటాలను 800 ప్రతి ఇంటికి అందించే విధంగా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బోగ విజయభాస్కర్, సౌత్‌జోన్ అద్యక్షుడు పురం హరి, నాగుల వెంకటేష్‌గౌడ్, బుర్ర సాయిరాంగౌడ్, సాయికుమార్, రేడియం రాములు తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఐకి సన్మానం

భగత్‌నగర్, ఫిబ్రవరి13: కొత్తపల్లి మండల ఎస్ఐగా బాధ్యతలు చేపట్టిన సాంబమూర్తిని బీజేపీ రాష్ట్ర ఎస్సీ మోర్చా అధికార ప్రతినిధి జాడి బాల్‌రెడ్డి ఆధ్వ ర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో నేతకాని సంఘం నాయకులు మాజి సర్పంచ్ గొల కిష్టయ్య, గోదారి నరేష్, జాడి ఎల్లయ్య, బండారి లక్ష్మణ్, బీజేపీ నాయకులు భాస్కరాచారి, వెంకటేష్‌గౌడ్, సాయిరాంగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

'ఆర్టీసీ కార్మికులపై వేధింపులు ఆపాలి'

సుభాష్‌నగర్, ఫిబ్రవరి13: ఆర్టీసీ కార్మికులపై అధికారుల వేధింపులు ఆపాలని ఆర్టీసీ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు గుర్రాల రవీందర్ డిమాండ్ చేశారు. మంగళవారం నగరంలోని ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్మికులకు ఆరోగ్యం బాగాలేక విధులకు హాజరు కాకపోతే వారిని రిమూవ్ చేసి వారి కుటుంబాలను రోడ్డుపాలు చేస్తున్నారని ఆరోపించారు. కొంత మంది దొంగ సర్టిఫికెట్స్‌తో సంవత్సరాల తరబడి ఉద్యోగాలు చేస్తున్నారని, వారిపై ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. ఆర్టీసీని కూడా ప్రక్షాళన చేయాలన్నారు.

కరీంనగర్ 2వ డిపోలో కె.రాజేశం అనే ఉద్యోగి డీఎం నుంచి సీఐ వరకు ఇచ్చే ముడుపులకు ఆశపడి తమ రిజర్వేషన్లకు తూట్లు పొడుస్తున్నారని ఆరోపించారు. ఇలాంటి అధికారుల బారిన పడ్డ కార్మికులను ఆదుకోవడంతో పాటు అతడిని ఉద్యోగం నుంచి తొలగించాలన్నారు. తమకు న్యాయం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కోరారు.

జేఈఈ మెయిన్స్‌లో ఎస్‌వీజేసీ విద్యార్థులకు ర్యాంకులు



విద్యార్థి సాత్విక్‌ను అభినందిస్తున్న ఎస్‌వీజేసీ కళాశాల డైరెక్టర్లు

కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 13: నగరంలోని ఎస్‌వీజేసీ జూనియర్ కళాశాల విద్యార్థులు జేఈఈ మెయిన్స్‌లో ఉత్తమ ర్యాంకులు సాధించి విజయకేతనం ఎగురవేశారని ఎస్‌వీజేసీ కళాశాల చైర్మన్ మహిపాల్‌రెడ్డి, డైరెక్టర్లు వర ప్రసాద్, రాంరెడ్డి, సింహాచలం హరికృష్ణ, వంగల సంతోష్‌రెడ్డి తెలిపారు. కళాశాల విద్యార్థి జి.సాత్విక్ 90.8 పర్సంటైల్స్‌తో విజయకేతనం ఎగురవేశాడు. 85, 81, 79, 77 పర్సంటైల్‌తో విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించి నందుకు కళాశాల యాజమాన్యం పుష్పగుచ్ఛం అందించి మెమొంటోతో సత్కరించింది. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల ఉన్నతి కోసం తమ కళాశాల నిరంతరం కృషి చేస్తుందని పేర్కొన్నారు.

జేఈఈ మెయిన్స్‌లో పారమిత విద్యార్థుల ప్రతిభ

కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 13: నగరంలోని పారమిత కళాశాల విద్యార్థులు జేఈఈ మెయిన్స్‌లో అత్యుత్తమ ఫలితాలు సాధించినట్లు పారమిత విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ప్రసాద్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. నర్మల కృష్ణతేజ 98.63, ఎం.దినేష్‌రెడ్డి 96.79, జి.మనస్విని 96.47 పర్సంటైల్‌తో జేఈఈ అడ్వాన్స్‌కు అర్హత సాధించారన్నారు. కళాశాల నుంచి 79 మంది విద్యార్థులు జేఈఈ మెయిన్స్ పరీక్ష రాయగా 8మంది విద్యార్థులకు 91 పర్సంటైల్‌కుపైగా సాధించారని పేర్కొన్నారు. గత సంవత్సరం జేఈఈ మెయిన్స్‌లో 98.48శాతం పర్సంటైల్ సాధించగా, ఈసారి 98.63 పర్సంటైల్‌తో మెరుగైన ప్రతిభ కనబరి చారని అన్నారు. 2024లో నిర్వహించే జేఈఈ మెయిన్స్ సెషన్-2లో మరింత అద్భుత ఫలితాలు సాధిస్తారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. నిరంతర అభ్యాసం, పర్యవేక్షణ విజయానికి కారణమని అన్నారు. అత్యుత్తమ ప్రతిభ కనబరించిన విద్యార్థులను, పారమిత క్షేత్ర కళాశాల అధ్యాపకులను ప్రసాద్‌రావు అభినందించారు.

పంచముఖి హనుమాన్ ఆలయంలో పూజలు


పూజలు చేస్తున్న అర్చకులు

కరీంనగర్ కల్చరల్, ఫిబ్రవరి13: నగరంలోని పంచముఖ హనుమాన్ ఆల యంలో హనుమాన్ పీఠాధిపతి పర బ్రహ్మ నందగిరి స్వామి ఆధ్వర్యంలో 11వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళ వారం ఫలరస పంచామృతా భిషేకాలు, హనుమాన్ చాలీసా పారాయణం, సామూహిక లక్ష నావల్లీ దళా ర్చన, హవనం నిర్వహించారు. అనంతరం స్వామీజీని సన్మానిం చారు. ఈకార్యక్రమంలో ఆలయ అధ్య క్షుడు బుస్స శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి పిట్ల స్వామి, ఆదిమూలం విద్యా సాగర్, విశ్వనాథం, తోట రాజేందర్, రామిడి నందం, దేవిశెట్టి హను మాండ్లు, జిఎస్ ఆనంద్, నరేందర్, వేంక టేశ్వర్లు, హనుమంతరావు, భూపతి, ఆంజనే యులు పాల్గొన్నారు.

ఆత్మవిశ్వాసమే విజయానికి తొలిమెట్టు

సుభాష్‌నగర్, ఫిబ్రవరి 13: ఆత్మవిశ్వాసమే విజయానికి తొలిమెట్టని హమ్ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు ధనపురి సాగర్ అన్నారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ పాఠశాల(గంజ్)లో పదవతరగతి విద్యార్థులకు ఎగ్జామ్ ప్యాడ్‌లను అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పరీక్షలంటే ఒత్తిడికి లోనుకాకుండా ఆత్మ విశ్వాసంతో పరీక్షలు రాయాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాదాయురాలు స్వరూపరాణి, సంస్థ సభ్యులు స్వర్ణలత, శ్రీముఖి, శ్రీనయన్, మన్‌సాయి, సాత్విక్ పాల్గొన్నారు.

కార్మికుల సమ్మెను విజయవంతం చేయాలి


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

శంకరపట్నం, ఫిబ్రవరి 13: ఈ నెల 16న జరిగే దేశవ్యాప్త కార్మికుల సమ్మె, గ్రామీణ బంద్‌ను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి పిట్టల సమ్మయ్య అన్నారు. మంగళవారం మండలంలో ఏఐటీయూసీ ఆధ్వర్యం లో తహసీల్దార్, పోలీస్‌స్టేషన్‌లో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 16న శంకరపట్నం మండల కేంద్రంలోని అంబే ద్కర్ కూడలి వద్ద ఉదయం 10గంటలకు ర్యాలీ ధర్నా కార్యక్రమం జరుగుతుంద న్నారు. కార్యక్రమానికి మండలంలోని కార్మికులు, హమాలీలు, మధ్యాహ్న భోజన, భవన నిర్మాణ, అంగన్‌వాడీ, ఆశావర్కర్లు, ఆటో యూనియన్లు, రైతులు, కూలీలు, వ్యవ సాయ కార్మికులందరూ హాజరై విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో సాయిలు, సదానందం, వెంకటస్వామి, కుమార్ ఉన్నారు.

హుజూరాబాద్ ఏసీపీగా శ్రీనివాస్


శ్రీనివాస్

హుజూరాబాద్, ఫిబ్రవరి 13: హుజూరాబాద్ ఏసీపీగా శ్రీనివాస్ జీని నియమిస్తూ డీజీపీ మంగళ వారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ ఏసీపీగా పనిచేస్తున్న జీవన్‌రెడ్డిని డీఐజీ కార్యాలయానికి అటాచ్ చేశారు. కొమురంభీమ్ ఆసిఫాబాద్ జిల్లాలో పనిచేస్తున్న ఏసీపీ శ్రీనివాస్ జీని హుజూరా బాద్ ఏసీపీగా నియమించారు. శ్రీని వాస్ జీ గతంలో జమ్మికుంట, ఎల్కతుర్తి, హుస్నాబాద్ సీఐగా పనిచేశారు. బుధవారం శ్రీనివాస్ జీ ఏసీపీగా పదవీ బాధ్యతలు స్వీకరించనున్నట్లు తెలిసింది.

అనారోగ్యంతో ఒకరి ఆత్మహత్య

గంగాధర, ఫిబ్రవరి 13: మండలంలోని గట్టుబూత్కూర్‌కు చెందిన బొల్లబత్తిని ఐలయ్య(52) అనారోగ్యంతో బాధపడుతూ ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ అభిలాష్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఐలయ్య కొన్ని సంవత్సరాలుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఐలయ్య భార్య చనిపోయింది. అనారోగ్యానికి తోడు ఒంటరిగా ఉంటున్నాడు. మంగళవారం ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి సోదరుడు పర్శరాములు ఫిర్యాదు మేర కు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రజా పోరాటాలు నిర్వహిస్తాం

చిగురుమామిడి,ఫిబ్రవరి 13: తెలంగాణ రాష్ట్రంలో రాను న్న రోజుల్లో బీఆర్ఎస్ అధికారంలోకి రావడం ఖాయమని, ప్రజా పోరాటాలు నిర్వహించి ప్రజల్లోనే ఉంటామని బీఆర్ ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మామిడి అంజయ్య అన్నారు. మంగళవారం అయన రేకొండలో విలేకరులతో మాట్లాడారు. ప్రజలు కాంగ్రెస్ పార్టీ తప్పుడు వాగ్దానాలను నమ్మి మోస పోయారన్నారు. రైతుల కు ఇప్పటి వరకు రైతుబంధు జమ కాలేదన్నారు. షాదీముబారక్, కేసీఆర్ కిట్లు మరుగున పడ్డాయన్నారు. బీఆర్ఎస్ అభ్యర్థులను పార్లమెంటు ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిపిస్తారని అన్నారు. ప్రజా సమస్యల కోసం పోరాటం చేస్తామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలన్నారు. ఈ సమావేశంలో నాయకులు కత్తుల రమేష్ యాదవ్, అనిల్, సంప త్‌గౌడ్, సదానందం, శ్రీనివాస్, అరవింద్ తదితరులు ఉన్నారు.

బాధ్యతలు స్వీకరించిన ఎంపీడీవోలు

తిమ్మాపూర్, ఫిబ్రవరి13: బదిలీల్లో భాగంగా జిల్లాకు వచ్చిన పలువురు ఎంపీడీవో మంగళ వారం బాధ్యతలు స్వీకరించారు. తిమ్మాపూర్ మండల ఎంపిడివోగా టి.విజయ్ కుమార్ మంగళ వారం బాధ్యతలు స్వీకరించారు. తిమ్మాపూర్ ఎంపిడివోగా బాధ్యతలు నిర్వహించిన చింతల రవీం దర్‌రెడ్డి జగిత్యాల జిల్లాకు బదిలీపై వెళ్లగా ఆయన స్థానంలో పెద్దపల్లి జిల్లా, రామగిరి మండలం లో ఎంపిడివోగా విధులు నిర్వహించిన టి.విజయ్‌కుమార్ తిమ్మాపూర్ మండలానికి బదిలీపై వచ్చారు. అధికారులు, సిబ్బంది విజయ్‌కుమార్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

● గంగాధర: గంగాధర ఎంపీడీవోగా డి రాము మంగళవారం బాధ్యతలు చేపట్టాడు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం పలువురు ఎంపీడీవోలను బదిలీ చేయగా ఇక్కడ పనిచేసిన రాజీవ్ మల్హోత్రా సిరిసిల్లకు వెళ్లారు. ఆయన స్థానంలో బెజ్జంకిలో పనిచేసిన రాము బదిలీపై గంగాధరకు వచ్చారు. ఈ సందర్భంగా మంగళవారం బాధ్యతలు చేపట్టారు.

● సైదాపూర్: సైదాపూర్ మండల ఎంపీడీవోగా బి యాదగిరి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. సైదాపూర్‌లో ఇంతకు ముందు పనిచేస్తున్న ఎంపీడీవో పద్మావతి జగిత్యాల జిల్లాకు వెళ్లగా, పెద్దపల్లి జిల్లా అంతర్గాంలో పనిచేసిన యాదగిరి సైదాపూర్‌కు బదిలీపై వచ్చారు.

● రామడుగు: రామడుగు మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా ఎస్ రాజేశ్వరి నియమితు లయ్యారు. జగిత్యాల రూరల్ మండలంలో పనిచేసిన రాజేశ్వరి రామడుగు మండలానికి బదిలీపై వచ్చి మంగళవారం బాధ్యతలను స్వీకరించారు.

● గన్నేరువరం: గన్నేరువరం మండల ఎంపీడీవోగా తీగల శంకర్ నియమితులయ్యారు.. ఇల్లందకుంట మండలంలో విధులు నిర్వహించిన శంకర్ మండలానికి బదిలీపై వచ్చి మంగళ వారం బాధ్యతలను చేపట్టారు.

● మానకొండూర్: మానకొండూర్ ఎంపీడివోగా ఎం. నర్సయ్య మంగళవారం పదవీ బాధ్యత లు చేపట్టారు. చిగురుమామిడి ఎంపీడీవోగా పనిచేసి బదిలీపై మానకొండూర్‌లో బాధ్యతలు చే పట్టడడంతో సిబ్బంది పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు. గతంలో ఎంపిడివోగా పనిచేసిన దివ్యదర్శన్‌రావు కరీంనగర్‌కు వెళ్లడంతో అప్పటి నుంచి ఇంచార్జి ఎంపిడివోగా ఎంపీవో రాజేశ్వర్ రావు బాధ్యతలు చూస్తున్నారు.

● చిగురుమామిడి: మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా బాస మధుసూదన్ మంగళవారం బాధ్యతలు స్వీరించారు. ఇక్కడ డిప్యూటేషన్ పై విధులు నిర్వహించిన ఎంపిడిఓ నర్సయ్య ఆయ న పోస్టింగ్ మండలమైన మానకొండూర్ మండలానికి బదిలీపై వెళ్లారు.

నకిలీ పత్రాలు సృష్టించి ప్రభుత్వ భూమిని కాజేసిన ఇద్దరి అరెస్టు

మానకొండూర్, ఫిబ్రవరి 13: నకిలీ ధ్రువపత్రాలను సృష్టించి పది గుంటల ప్రభుత్వ భూమి ని కాజేసిన ఇద్దరు వ్యక్తులను మంగళవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు స్థానిక సీఐ రాజ్‌కుమార్ తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని దేవంపల్లి గ్రామానికి చెందిన బోయిని శంకరయ్య తన భూమి పక్కన ఉన్న భూమిని కాజేసేందుకు నకిలీ ధ్రువపత్రా లను సృష్టించారు. రూ.20వేల ఒప్పందంతో గుండా ఆంజనేయులు నకిలీ నో ఆబ్జక్షన్ సర్టిఫికెట్‌తో పాటు నకిలీ పంచాయతీ స్టాంపులు, పంచాయతీ కార్యదర్శి శాశ్వత సంతకాలను ఫోర్జరీ చేసిన ట్లు తెలిపారు. ఈ నకిలీ పేపర్లతో తిమ్మాపూర్‌లోని రిజిస్ట్రేషన్ కార్యాలయంలో శంకరయ్య పేరి ట రిజిస్ట్రేషన్ చేయించాడని తెలిపారు. పంచాయితీ కార్యదర్శి ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టా రు. ఇద్దరిపై ఐపీసీ సెక్షన్లు 420, 468, 471,472 కింద కేసు నమోదు చేసి జ్యూడీషియల్ మె జిస్ట్రేట్ కోర్టులో హాజరు పరచగా మెజిస్ట్రేట్ ఆదేశాల మేరకు జైలుకు తరలించినట్లు తెలిపారు.

బల్దియా అసిస్టెంట్ కమిషనర్ బదిలీ

కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 13: నగరపాలక సంస్థ అసిస్టెంట్ కమిషనర్ నరేశ్‌బాబు బదిలీ అయ్యారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం చేపడు తున్న బదిలీల్లో భాగంగా మంగళవారం నగరపాలక సంస్థలో ఇద్దరు అధికారులను బదిలీ చేస్తూ సీడీఎంఏ ఉత్తర్వులు జారీ చేశారు. అసిస్టెంట్ కమిషనర్ నరేశ్ బాబును నాగర్‌కర్నూల్ కమిషనర్‌గా, సూపరింటెండెంట్ ఖాజా మొహినొద్దీన్‌ను గ్రేటర్ హైదరాబాద్‌లో గ్రేడ్-3 కమిషనర్‌గా బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. దీనితో వారు మంగళవారం విధుల నుంచి రిలీవ్ అయ్యారు. వీరిద్దరి స్థానాల్లో ఎవరికీ పోస్టింగ్ ఇవ్వలేదు.

అధికారుల బదిలీలు

కరీంనగర్‌రూరల్, ఫిబ్రవరి13: కరీంనగర్ రూరల్, కొత్తపల్లి ఎంపీడీవోలు, కొత్తపల్లి మున్సిపల్ కమిషనర్ బదిలీ అయ్యారు. ఎంపీ ఎన్నికల నేపథ్యంలో ఇక్కడ పని చేస్తున్న అధికారులను బదిలీ చేశారు. కరీంనగర్ రూరల్ ఎంపీడీవో దివ్యదర్శన్‌రావు, కొత్తపల్లి ఎంపీడీఓ శ్రీనివాస్ రెడ్డితో పాటు, కొత్తపల్లి మున్సిపల్ కమిషనర్ కె వేణు మాధవ్‌లు బదిలీపై వెళ్లిపోయారు. కరీంనగర్ ఎంపీడీవోగా నూతన నంగా సంజీవరావు బాధ్యతలు చేపట్టగా, కొత్తపల్లి ఎంపీడీవోగా కె ప్రభు నియమితులయ్యారు.

బదిలీ అధికారులకు సన్మానం

కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 13: జిల్లా నుంచి బదిలీపై వెళ్తున్న అధికారులను కలెక్టర్ పమేలా సత్పతి మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఘనంగా సన్మానించారు. కరీంనగ్ జిల్లా అధికారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన సన్మాన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ నిబద్ధత అంకితభావంతో పనిచేసినప్పుడే ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు విజయవంత మవుతాయన్నారు. కరీంనగర్ జిల్లాలో పనిచేసి బదిలీపై వెళ్తున్న డిఆర్‌డిఓ శ్రీలత, డిపిఓ వీరబుచ్చయ్య, జెడ్పీ సీఈఓ పవన్‌కుమార్, డివైఎస్‌ఓ రాజవీరులకు వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో అదనపుకలెక్టర్ ప్రఫుల్‌దేశాయ్, డిఆర్‌ఓ పవన్‌కుమార్, డిపిఓ వీరబుచ్చయ్య, సీఈఓ పవన్‌కుమార్, డివైఎస్‌ఓ రాజవీరు, మెప్మా పిడి బి రవీందర్, సిపిఓ కొమురయ్య, మార్కెటింగ్ అధికారి పద్మావతి, జిల్లా పరిశ్రమల అధికారి నవీన్, డిడబ్ల్యుఓ సరస్వతి, నేతినియల్, సురేష్; కలీం, టి వెంకన్న, జెడి హర్టికల్చర్ శ్రీనివాస్, డాక్టర్ సుజాత, డిఏఓ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు దుస్తులు పంపిణీ

సుభాష్‌నగర్, ఫిబ్రవరి 13: భరోసా స్వచ్ఛంద సంస్థ, వాసవీక్లబ్ ఆధ్వర్యంలో నగరంలోని అంధుల పాఠశాలలో విద్యార్థులకు దుస్తులు, బదిరుల పాఠశాలలో ఎగ్జామ్ ప్యాడ్ లను అందచేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు అక్కి నపల్లి నాగరాజు, శివజ్యోతి, తాటిపెల్లి సతీష్‌బాబు, దొంతుల స్వాతి, రామకృష్ణ, అంధుల పాఠశాల ప్రధానోపాధ్యా యురాలు నర్మదా, బధిరుల పాఠశాల ప్రధానో పాధ్యాయురాలు నాగలక్ష్మీ, రమేశ్, భాస్కర్ పాల్గొన్నారు.

సంత్ గాడ్గె బాబా జయంతిని విజయవంతం చేయాలి

సుభాష్‌నగర్, ఫిబ్రవరి 13: సంత్ గాడ్గె బాబా జయంతిని విజయవంతం చేయాలని మన రజక సంఘం తెలంగాణ జాతీయ కో ఆర్డినేటర్ కె మల్లేశ్ కుమార్ పిలుపునిచ్చారు. మంగళవారం నగరంలోని ప్రెస్‌భవన్‌లో ఆయన జయంతి వివరాలను తెలియ చేశారు. సంత్ గాడ్గెబాబ మహారాష్ట్రలోని దేశ్‌గావ్ అమ రావతి తాలూకాలో 1876 ఫిబ్రవరి 23న జన్మించాడని తెలిపారు. ఆయన అసలు పేరు దేబూజీ జింగాజ్ జోవ కర్ అని, ఆయన ఉద్యమాలు చేశారని తెలిపారు. ఈ నెల 23న హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో నిర్వహిం చే జయంతి కార్యక్రమానికి మంత్రులు పొన్నం ప్రభాకర్, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, జూపల్లి, మాజీ గవర్నర్ సిహెచ్ విద్యాసాగర్‌రావు ముఖ్య అతిథులుగా పాల్గొం టారని అన్నారు. రజకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో పూసాల శ్రీకాంత్, కొత్తకొండ శ్రీనివాస్, పంతగి రవి, జంగలపల్లి శంకర్, పోతుగంటి శంకర్ పాల్గొన్నారు.

విటమిన్ ఎ ద్రావణం పంపిణీ

జమ్మికుంట రూరల్, ఫిబ్రవరి 13: జమ్మికుంట మండలం వావిలాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఉప కేంద్రాల్లో ఐదేళ్ల లోపు పిల్లలకు విట మిన్ ఎ ద్రావణం పంపిణీ కార్యక్రమాన్ని వైద్యాధికారిణి సన జవేరియా మంగళవారం ప్రారంభించారు. పెద్దంపల్లి గ్రామంలోని పిల్లలకు ఎంపీపీ దొడ్డె మమత విటమిన్ ఎ ద్రావణం వేశారు. వైద్యాధికారిణి మాట్లాడు తూ తొమ్మిది నెలల నుంచి ఐదేళ్ల లోపు పిల్లలకు ఎ విటమిన్ ద్రావణం ఇవ్వడం జరుగుతుందన్నారు. తొమ్మి ది నెలల నుంచి ఐదేళ్ల వరకు ప్రతి ఆర్నెళ్లకు ఒకసారి ఎ ద్రావణం తప్ప నిసరి తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ దొడ్డె మమత-ప్రసాద్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీస ర్ శంకర్‌రెడ్డి, ఆరోగ్యశాఖ సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌కు గుణపాఠం చెపుతాం

హుజూరాబాద్, ఫిబ్రవరి 13: తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం ఎన్నో ఉద్యమాలు చేసిన వారిని పక్కన పెట్టిన బీఆర్ఎస్ పార్టీకి పార్లమెంట్ ఎన్నికల్లో తగిన గుణపాఠం తెలంగాణ ఉద్యమకారుల ఫోరం జిల్లా చైర్మన్ కె కుమా రస్వామి అన్నారు. మంగళవారం హుజూరాబాద్ ప్రెస్‌క్లబ్ లో ఆయన విలేకరులతో మాట్లాడారు. పదేళ్లలో బీఆర్ఎస్ పార్టీ ఉద్యమంలో పనిచేసిన నాయకులను పట్టించుకోలే దన్నా రు. సమా వేశంలో మల్లాచార్యులు, పి సంతోష్, పి మల్లేష్, సదా నందం, అంకూస్, సాగర్, అబ్బల్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్స్‌లో ప్రతిభ

ఇల్లందకుంట, ఫిబ్రవరి 13: జేఈఈ మెయిన్స్ తొలి విడత మంగళవారం ప్రకటించిన ఫలితాల్లో ఇల్లంద కుంట మండలం సీతంపేట గ్రామానికి చెందిన వడ్లూరి ప్రతీక్ 99.75శాతంతో ప్రతిభ కనబరిచాడు. ప్రణాళికతో చదవడంతోనే ఉత్తమ ఫలితాలు సాధించినట్లు ప్రతీక్ తెలిపారు. గ్రామస్థులు ప్రతీక్‌ను అభినందించారు.

సీసీఈ విధానాన్ని పక్కాగా అమలు చేయాలి

రామడుగు, ఫిబ్రవరి 13: మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ హైస్కూళ్లలో సీసీఈ విధానాన్ని పక్కాగా అమలు చేయాలని వెదిర స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం ఎస్.రాజమౌ ళి అన్నారు. మండలంలోని వెలిచాల సరస్వతి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో పదో తరగతి చదువుతున్న 29మంది సీసీఈ రికార్డులను మంగళవారం తన టీంతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ మారుతున్న కాలానికనుగుణంగా విద్యా వ్యవస్థలో ఎప్పటికప్పుడు మార్పులు వస్తున్నాయని, విద్యార్థులను ఆ మార్పులకు అనుగుణంగా తయారు చేయాలని సూచిం చారు. అనంతరం రికార్డులను పరిశీలించి సంతృప్తి చెందా రు. ఈ కార్యక్రమంలో స్కూల్ ఎచ్‌ఎం ఉప్పుల శ్రీనివాస్, కోకరస్పాండెంట్ సత్యం, టీం మెంబర్లు సత్యనారాయణ రెడ్డి, చంద్రశేఖర్, టీచర్స్ పాల్గొన్నారు.